

**కనుమకు మటన్..** కనుమ సందర్భంగా మటన్ దుకాణాలకు జనం భారీగా తరలి వచ్చారు. సికింద్రాబాద్‌లోని ఓ దుకాణం వద్ద క్యూ ఏర్పాటు చేశారు.


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్-మేడ్చల్

I హైదరాబాద్, గురువారం 16 జనవరి 2025 | HYDERABAD




## నిమ్స్‌లో 2న రేడియాలజీ జాతీయ సదస్సు

ఖైరతాబాద్, జనవరి 15: నిమ్స్ వ్యవస్థాపక డైరెక్టర్ దివంగత ప్రొఫెసర్ కాకర్ల సుబ్బారావు శతజయంతి వేడుకల్లో భాగంగా ఫిబ్రవరి 2వ తేదీన సొసైటీ ఆఫ్ ఇండియాన్ రేడియోగ్రాఫర్స్, నిమ్స్ రేడియాల విభాగాల ఆధ్వర్యంలో ఆ అంశంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప తెలిపారు. ఈ మేరకు నిమ్స్‌లో సదస్సుకు సంబంధించిన బ్రోచర్లను నిమ్స్ డీన్ డాక్టర్ లీజా రాజశేఖర్, రేడియో డయాగ్నస్టిక్స్ విభాగాధిపతి డాక్టర్ అనుకపూర్, రేడియోలజీ కళాశాల ప్రిన్సిపాల్ శీరందాస్ శ్రీనివాస్, ఇండియన్ రేడియోగ్రాఫర్స్ అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ దామోదర నాయుడుతో కలిసి ఆవిష్కరించారు.



**పెరిగిన రద్దీ** సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్ మెట్రో స్టేషన్, ఫ్లై ఓవర్ దగ్గర బుధవారం వాహనదారులు, ప్రయాణికులతో ట్రాఫిక్ రద్దీ పెరిగింది. దీంతో వాహనదారులు కాస్త ఇబ్బందులకు గురయ్యారు.



శిక్షణ పూర్తి చేసుకున్న అసిస్టెంట్ కమాండోల కవాతు

## ప్రజా రక్షణలో సీఐఎస్ఎఫ్ సేవలు కీలకం

### సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ రజ్వీందర్‌సింగ్

జవహర్‌నగర్, జనవరి 15: దేశ భద్రతలో ధైర్యసాహసాలతో కూడిన సేవలు అందించాలని, లోటుపాట్లకు లోనుకాకుండా నిస్వార్థంగా పనిచేస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని శిక్షణ పొందిన అసిస్టెంట్ కమాండెంట్స్‌కు సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ రజ్వీందర్‌సింగ్ భట్టి ఐపీఎస్ పిలుపునిచ్చారు. బుధవారం శామీర్‌పేట మండలం హకీంపేట్‌లోని (నీసా) నేషనల్ ఇండస్ట్రియల్ అథారిటీ పరేడ్ గ్రౌండ్‌లో శిక్షణ పొందిన 37వ బ్యాచ్ అసిస్టెంట్ కమాండోలు 53 మంది, 20వ బ్యాచ్‌కు చెందిన 221 మంది కానిస్టేబుళ్లకు పాసింగ్ అవుట్ పరేడ్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా డైరెక్టర్ జనరల్ రజ్వీందర్‌సింగ్ భట్టి ఐపీఎస్ హాజరై పరేడ్‌ను ప్రారంభించి మాట్లాడారు. శిక్షణ పూర్తి చేసుకున్న అసిస్టెంట్ కమాండోలకు.. స్టార్ పెట్టేటప్పుడు కమాండోల తల్లిదండ్రులు ఆనందంతో ఉప్పొంగిపోయారు. కార్యక్రమంలో నీసా డైరెక్టర్ కె.సునీల్ ఇమ్మాన్యుయేల్, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనువాసబాబు, అధికారులు, జవాన్ల తల్లిదండ్రులు, నీసా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన అసిస్టెంట్ కమాండోకు అవార్డు అందజేస్తున్న రజ్వీందర్‌సింగ్ భట్టి ఐపీఎస్

# ప్రచారం దండి.. ఖజానాకు గండి..!

## యాడ్ ఏజెన్సీలపై నియంత్రణ కోల్పోయిన జీహెచ్ఎంసీ

### జీహెచ్ఎంసీ ప్రకటన విభాగంలో అధికారుల ఇష్టారాజ్యం

### రికార్డుల్లో ఒకలా.. క్షేత్రస్థాయిలో మరోలా..

### కేబీఆర్ పార్కు చుట్టూ అనధికారిక లాలీపాప్స్..

### లెక్కకు మించి ట్రాఫిక్ అంబ్రెల్లాలు

### క్షేత్రస్థాయి తనిఖీలు పట్టని అధికారులు

సిటీబ్యూరో, జనవరి 15(నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీకి ఆదాయ వనరుల్లో అడ్వర్టయిజ్‌మెంట్ (ప్రకటన విభాగం) ప్రత్యేకం. ఏటా రూ.80 కోట్ల పైన రావాల్సిన చోట.. కేవలం రూ. 20 కోట్లు దాటడం లేదు. ఏజెన్సీల కొమ్ముకాస్తూ కొందరు అధికారులు బల్దియా ఖజానాకు గండి కొడుతున్నారు. ముఖ్యంగా కేబీఆర్ పార్కు కేంద్రంగా ప్రకటన దందా జరుగుతున్నదని ఫిర్యాదులు వస్తున్నా ఉన్నతాధికారులు పర్యవేక్షించడం లేదు. కేబీఆర్ పార్కు చుట్టూ, ప్రధాన రహదారి సెంట్రల్ మీడియన్‌లో అత్యధికంగా లాలీపాప్స్ (ప్రకటనల బోర్డులు) దర్శనమిస్తాయి. రికార్డుల కంటే అత్యధికంగా అనధికారికంగా ఉంటాయన్నది ప్రధాన ఆరోపణ. ముఖ్యంగా కొంత మేరలో కోర్టు స్టే ఆర్డర్ పేరుతో న్యాయస్థానంలో గెలిచి సదరు జీహెచ్ఎంసీ ఆదాయాన్ని మెరుగుపర్చే చోట ప్రకటనల విభాగంలోని కొందరు అధికారులు నెలకు రూ.5 లక్షల మేర ముడుపులు సదరు ఏజెన్సీ నుంచి అందుతున్నాయని బలంగా వినిపిస్తున్న విమర్శ. దీనికి తోడు నగరంలో ఎక్కడైనా 15 మీటర్ల కంటే ఎత్తు ఉన్న హోర్డింగ్‌లను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరు. 15 మీటర్ల వరకు ఉన్న హోర్డింగ్‌లు సైతం పక్కాగా నిబంధనల ప్రకారం నడపాలి. సదరు ఏజెన్సీలు మెట్రో పిల్లర్ల లక్ష్యంగా అక్రమార్జనకు పాల్పడుతున్నారని తెలుస్తున్నది. నగరంలో 1500 చోట్ల ట్రాఫిక్ అంబ్రెల్లాలు ఉంటే 3వేల వరకు ఉన్నాయని, వీటిని క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలన్న వాదనలు వినిపిస్తున్నాయి.

### గ్రేటర్‌లో ఎన్ని అనుమతులున్నాయో..?

గ్రేటర్ హైదరాబాద్‌లో ఎన్ని హోర్డింగులకు అనుమతులున్నాయో, వాటికి ఎంత గడువుందో తెలియదు. అక్రమంగా ఏర్పాటైన హోర్డింగులెన్నో.. వాటి ద్వారా జీహెచ్ఎంసీ ఖజానాకు జరుగుతున్న నష్టానికి లెక్కేలేదు. యూనిపోల్స్, లాలీపాప్స్, హోర్డింగు ఇలా అనేక ఉన్న ప్రాంతాలు అధికారుల రికార్డులు లెక్కలకు, క్షేత్రస్థాయిలో ఉన్న వాటికి ఎక్కడ పొంతన ఉండటం లేదన్నది ఇటీవల వస్తున్న బలమైన ఆరోపణలు. ఈ క్రమంలోనే ప్రకటన విభాగంలో భారీగా అవినీతి జరుగుతున్నదని, జీహెచ్ఎంసీకి రావాల్సిన అడ్వర్టయిజ్‌మెంట్ ట్యాక్స్ కోట్లాది రూపాయలను కొందరు అధికారులు పక్కదారి పట్టిస్తున్నారని, అక్రమ హోర్డింగ్స్‌లు, మాల్స్‌లో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేసిన వారు 'కార్తీక్' ట్యాక్స్ చెల్లిస్తున్నారని గతంలో జరిగిన కౌన్సిల్‌లో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ దృష్టికి కార్పొరేటర్లు తీసుకువచ్చారు. ప్రకటనల రూపంలో వందల కోట్లు రావాల్సిన చోట కేవలం రూ.20 కోట్లు మాత్రమే వస్తుండటం పట్ల కార్పొరేటర్లు తీవ్రంగా తప్పుపట్టారు.

### కనిపించని క్షేత్రస్థాయి తనిఖీలు

గ్రేటర్‌లో ఎన్ని కేటగిరీల నుంచి జీహెచ్ఎంసీకి ఆదాయం వస్తుందనేది స్పష్టత లేదు. సెంట్రల్ డివైడర్లు, యూనిపోల్స్, హోర్డింగ్స్, నియో గ్లోసైన్ బోర్డులు, బస్ షెల్టర్లు, వాల్ పెయింటింగ్, ఫ్లెక్సీ బోర్డు, గ్లాస్ పోస్టర్, పిల్లర్ బోర్డులు, పెయింటింగ్, స్టిక్కర్, ఫ్లాగ్స్, షాప్ షూట్ బెలూన్లు, అంబ్రెల్లాస్, స్లైడ్, షార్ట్ ఫిల్మ్, ఆటోలు, బస్సులు, క్యాబ్స్, వ్యాన్స్‌లకు సంబంధించిన ప్రకటనలపై ఫీజు వసూలు చేయాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. పెట్రోల్ బంకుల్లో భారీ స్థాయిలో గ్లోసైన్ బోర్డులు ఏర్పాటు చేసుకుని ప్రకటనలు ఇస్తున్నారు. వీటిని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. సినిమా హాళ్లు, మల్టీప్లెక్స్‌లను పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.




నగరంలో ఒకచోట అనధికారికంగా ఉన్న ట్రాఫిక్ అంబ్రెల్లా

## పండుగ వేళ .. పైప్‌లైన్ పనులు పూర్తి

### యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టిన జలమండలి

### రోడ్లన్నీ ఖాళీ ఉండటంతో వేగంగా తాగు, మురుగునీటి పనులు

సిటీబ్యూరో, జనవరి 15(నమస్తే తెలంగాణ): సంక్రాంతి పండుగ నేపథ్యంలో నగరంలో రోడ్లు ఖాళీగా ఉండటంతో ఈ అవకాశాన్ని జలమండలి అధికారులు తాగు, మురుగునీటి పైపులైన్ మరమ్మతులు చేపట్టి సద్వినియోగం చేశారు. సాధారణ రోజుల్లో ఈ పనులు నిర్వహిస్తే ప్రజలకు ఇబ్బంది కలిగే అవకాశం ఉండటంతో పండుగ సమయాన్ని సమస్యల పరిష్కారానికి కేటాయించి వేగంగా పనులు పూర్తి చేశారు. మూసాపేట రోడ్ క్రాసింగ్ పనులు, కేపీహెచ్‌బీ ఫోరం మాల్ సర్కిల్ దగ్గర సీవరేజీ పైపులైన్, మూసాపేటలోని అంజనేయ నగర్‌లో సీవరేజీ, బంజారాహిల్స్ రోడ్ నం. 10 పైపులైన్ లీకేజీ, జగద్గిరిగుట్టలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద ఏర్పడ్డ లీకేజీని అరికట్టారు. ప్రగతినగర్‌లో నీటి సరఫరా పెంచడానికి గ్యాప్ క్లోజర్ పనులు నిర్వహించారు. పంజాగుట్ట క్రాస్‌రోడ్స్‌లో సీవరేజీ పైపులైన్ డ్యామేజ్ కావడంతో దానికి మరమ్మతులు నిర్వహించారు. ఈ పనులన్నింటిని సంబంధిత సర్కిళ్ల జీఎంలు, సెక్షన్ మేనేజర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందిని, అధికారులను ఎండీ అశోక్‌రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ అభినందించారు.

## రెండోదశలో..160 కిలోమీటర్లు

### మెట్రో విస్తరణలో పార్ట్-బీ కీలకం

### మార్చి నెలాఖరు వరకు డీపీఆర్ సిద్ధం చేయనున్న మెట్రో సంస్థ



సిటీబ్యూరో, జనవరి 15(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మెట్రో విస్తరణలో సెకండ్ ఫేజ్‌లోని పార్ట్-బీ అత్యంత కీలకంగా మారింది. ఇన్నాళ్లు మొత్తంగా 69కిలోమీటర్ల మేర మెట్రో రైలు మాత్రమే అందుబాటులో ఉండగా, రెండో దశ విస్తరణతో నగరంలో కొత్తగా 160 కిలోమీటర్లు అందుబాటులోకి రానున్నది. ఫేజ్-2ను రెండు భాగాలుగా పనులు చేపట్టేందుకు డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)లను తయారు చేసిన హెచ్ఏఎంఎల్ సంస్థ... తాజాగా పార్ట్-బీలో నార్త్ సిటీకి మెట్రోను విస్తరిస్తూ డీపీఆర్ సిద్ధం చేస్తున్నది. దీంతో ఫేజ్-1, ఫేజ్-2 కలిపి నగరంలో ప్రాజెక్టులతో మొత్తంగా 232 కిలోమీటర్ల పొడవైన మెట్రో నిర్మితం కానున్నది. నగరానికి మెట్రో పరిధిని పెంచడంలో ఫేజ్-2 ముఖ్యమైనదైతే, 90కిలోమీటర్ల మేర అతి పొడవైన పార్ట్-బీ ప్రాజెక్టు నగర మెట్రో విస్తరణలో ముఖ్యమైనదనీ నిపుణులు చెబుతున్నారు.

### ఫోర్త్ సిటీకి డీపీఆరే ముఖ్యం..

కోర్ సిటీతో అనుసంధానం చేస్తూ గేట్ వే ఆఫ్ తెలంగాణగా పిలిచే నార్త్ హైదరాబాద్, ఫోర్త్ సిటీ ప్రాంతానికి మెట్రో పరుగులు పెట్టాలంటే డీపీఆర్ ముఖ్యమైనది. మూడు నెలల్లో ప్రాజెక్టు నివేదిక రూపొందించనున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆమోదం తర్వాత ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనున్నది. ఈ క్రమంలో నగరంలో శివారు ప్రాంతాలకు మెట్రో నిర్మించేందుకు ఫేజ్-2 మెట్రో విస్తరణలో భాగంగా పార్ట్-బీలో జేబీఎస్ నుంచి శామీర్‌పేట్(22కి.మీ), ప్యారడైజ్ నుంచి మేడ్చల్(23కి.మీ) వరకు, ఎయిర్‌పోర్టు నుంచి ఫోర్త్ సిటీ వరకు (45కి.మీ) మేర మొత్తంగా 90 కిలోమీటర్ల పొడవైన మెట్రో మార్గం నిర్మితం కానున్నది. తొలుత నార్త్ సిటీ ప్రాంతాలను పరిగణనలోకి తీసుకోకుండా, కేవలం ఫోర్త్ సిటీ-శంషాబాద్ ప్రాజెక్టును మాత్రమే ఫేజ్-2లో చేర్చిన ప్రభుత్వం డీపీఆర్ లేకుండా పార్ట్-ఏను మాత్రమే కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం పంపింది. ఆ తర్వాత పార్ట్-బీలో ఫోర్త్ సిటీతోపాటు నార్త్ సిటీని కూడా చేర్చడంతో... నగరంలో మొత్తంగా రెండో దశ మెట్రో విస్తరణ 162 కిలోమీటర్లు అందుబాటులోకి రానున్నది. ఇప్పటికే ఫేజ్-2 పార్ట్-ఏలో 76 కిలోమీటర్ల మెట్రో నిర్మాణానికి అవసరమైన డీపీఆర్ సిద్ధం కాగా, పార్ట్-బీలో భాగంగా ఫోర్త్ సిటీ, ప్యారడైజ్-మేడ్చల్, జేబీఎస్-శామీర్‌పేట ప్రాంతాలు రానున్నాయి.

### పార్ట్-బీతో 90 కిలోమీటర్లు..

ప్రస్తుతం ఫేజ్-1 ద్వారా మెట్రో కేవలం కోర్ సిటీ ప్రాంతాలకు మాత్రమే రాకపోకలు సాగించే వీలు కలిగింది. కానీ ఫేజ్-2లోని పార్ట్-బీ అందుబాటులోకి వస్తే 90 కిలోమీటర్ల పొడవైన మెట్రోతో శివారు ప్రాంతాల వరకు ప్రయాణించే వీలు కలుగనున్నది. రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేసుకుంటున్న ఫోర్త్ సిటీకి అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు, కోర్ సిటీని అనుసంధానం చేసే మార్గం కూడా అందుబాటులోకి రానున్నది. పార్ట్-బీ ద్వారానే ఏకంగా 90 కిలోమీటర్ల మెట్రో నిర్మితం కానున్నది. ఫేజ్-2 పార్ట్-బీగా డీపీఆర్‌ను మూడు నెలల్లో సిద్ధం అవుతుంది. హైదరాబాద్ నగర ప్రజల అవసరాలకు అనుగుణంగా మెట్రో విస్తరణతో రవాణా సదుపాయాలు అందుబాటులోకి రానున్నదని హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్.రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. అయితే మియాపూర్ వరకు మెట్రో సౌకర్యం ఉన్నది. ఇక్కడి నుంచి పటాన్‌చెరు వెళ్లేందుకు రోడ్డు రవాణా సదుపాయం కూడా ఉన్నది. మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు మెట్రో విస్తరించినా పెద్దగా వచ్చే ప్రయోజనం ఉండదు. అదేవిధంగా ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు మెట్రో విస్తరించినా ఆశించిన స్థాయి ప్రయోజనాలు ఉండవు. కానీ కోర్ సిటీ నుంచి శివారులో ఉండే మేడ్చల్, శామీర్‌పేట్, శంషాబాద్, ఫోర్త్ సిటీ వంటి ప్రాంతాల అనుసంధానంతో నగరంలో పొడవైన రవాణా సౌకర్యం నగరవాసులకు అందుబాటులోకి వస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# చైనా మాంజా.. మృత్యు పంజా

### నగరవాసుల గొంతు కోస్తున్న సీసం పూత దారాలు

### ఏ ఏటికాయేడు హడావుడి చేసి.. ఆ తర్వాత పట్టించుకోని పోలీసులు

### హంగామాగా మిగిలిపోతున్న కట్టడి

సిటీబ్యూరో, జనవరి 15(నమస్తే తెలంగాణ): చైనా మాంజాలు మనుషుల గొంతు కోస్తున్నాయి. చైనా మాంజాలతో మూడు పోలీస్ కమిషనరేట్ల పరిధిలో పలు ఘటనలు చోటుచేసుకున్నాయి. వాహనాలపై వెళ్తున్న వారి గొంతులకు తగిలి గాయాలకు గురయ్యారు. గత సంక్రాంతి సమయంలో ఆర్మీ జవాన్‌ను బలి తీసుకున్నది. సంక్రాంతి వచ్చిందంటే పతంగుల ఎగురవేతతో సంబురాలు చేసుకుంటూ ఉత్సాహంగా పండుగ జరుపుకుంటారు. పతంగుల ఎగురవేతలో నైలాన్‌తో చేసిన సీసం కోటింగ్ ఉండే చైనా మాంజాలను ఉపయోగించే వారు చాలా మంది ఉన్నారు. ఈ పతంగులు ఎక్కడో తెగిపోవడం, పతంగులు ఎగురేసే సమయంలో నైలాన్‌తో కూడిన దారాలు పక్షులు, జంతువులు, మనుషుల ప్రాణాలు హరించేస్తున్నాయి. ప్రతి యేడు ప్రమాదాలు జరుగుతున్నాయి, అయినా పోలీసులు ముందు చూపుతో వ్యవహరించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఈ ఏడాది మూడు పోలీస్ కమిషనరేట్లలోని టాస్క్‌ఫోర్స్, ఎస్‌ఓటీ పోలీసులు స్పెషల్ ఫోకస్ పెట్టి కట్టడి చేసేందుకు ప్రయత్నించినా ఫలితం మాత్రం అంతంత మాత్రంగానే మిగిలింది. ఫలితంగా ఈ సంక్రాంతి పండుగ వేళ కూడా వాహనదారులు చైనా మాంజాల బారినపడి గాయాలకు గురికావాల్సి వచ్చింది. నారాయణగూడ ఫ్లైఓవర్‌పై జరిగిన ఘటనలో కానిస్టేబుల్‌కు మెడకు గాయం కాగా, యాదగిరిగుట్ట ప్రాంతంలో మరో వ్యక్తికి గాయాలయ్యాయి.

### ఎవరిదీ నిర్లక్ష్యం..!

రోడ్డుపై వెళ్లడమే పాపంగా మారింది. ఎక్కడి నుంచి దారం వచ్చి మెడకు చుట్టుకుంటుందోనని ఆందోళనలో వాహహనదారులు ఉన్నారు. రోడ్లపై ఎక్కడ చూసినా స్తంభాలు వేలాడుతున్న దారాలు కన్పిస్తున్నాయి. వీటిని గుర్తించిన చాలా మంది ఆ ధారాలను అక్కడుండే స్తంభాలకు, చెట్లకు కడుతూ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. సోషల్‌మీడియా ద్వారా వాహనదారులను అప్రమత్తం చేస్తూ వాహనంపై వేగంగా వెళ్లొద్దని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ఎక్కడైనా రోడ్లపై పతంగుల దారాలు వేలాడుతూ కన్పిస్తే వాటిని తొలగించడం, పక్కకు తీయడం వంటివి చేయాలని కోరుతున్నారు. అయితే మనుషుల ప్రాణాలు తీసే వరకు చైనా మాంజాలు వచ్చినా.. వాటిని కట్టడి చేయకపోవడానికి పలు కారణాలున్నాయి. క్షేత్రస్థాయిలోని పోలీసులు కొందరు వ్యాపారులతో మిలాఖత్ అవుతున్నారనే ఆరోపణలున్నాయి. సంక్రాంతి వచ్చిందంటే ప్రతి గల్లీలో విక్రయాలు చేస్తుంటారు. ఆయా విక్రయాల దగ్గర చైనా మాంజాలు రహస్యంగా వ్యాపారులు విక్రయిస్తుంటారు. వీటిని గుర్తించి కట్టడి చేయాల్సిన స్థానిక పోలీసులు ఆ దిశగా చర్యలు తీసుకోవడంలేదు. టాస్క్‌ఫోర్స్, ఎస్‌ఓటీ పోలీసులు మాత్రమే కట్టడి చేయాలనే విధంగా క్షేత్రస్థాయిలో పోలీసులు మనకెందుకులే అనేలా వ్యవహరిస్తున్నారు. ఆ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవడంలేదని.. నిర్లక్ష్యంగా ఉంటున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. దీంతో నగరంలో విచ్చలవిడిగా చైనా మాంజాల విక్రయాలు సాగుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక ముందైనా పూర్తిస్తాయిలో చైనా మాంజాల వాడకాన్ని పూర్తిస్థాయిలో కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### ఆన్‌లైన్‌లో చైనా మాంజాలు

#### ఈ-కామర్స్ స్టోర్‌లపై దాడులు : సీపీ సీవీ ఆనంద్

చైనా మాంజాలు ఇక్కడ లభిస్తున్నాయంటే ఆ మాంజాలు ఇండియాలోనే తయారవుతూ, ఈ కామర్స్ ద్వారా ఆన్‌లైన్‌లో సప్లయ్ అవుతున్నాయని నగర పోలీస్ కమిషనర్ సీపీ సీవీ ఆనంద్ ట్విట్టర్‌లో వెల్లడించారు. ఎవరైనా దీనిని ఆర్డర్ చేస్తే అవి ఇంటికే నేరుగా వస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలోనే ఈ కామర్స్ స్టోరేజ్ హౌస్‌లపై దాడి చేయడంతోపాటు ఆయా స్టోరేజ్ యాజమాన్యాలతో సమావేశాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

### కానిస్టేబుల్ గొంతు కోసిన చైనా మాంజా



తీవ్రంగా గాయపడిన ట్రాఫిక్ కానిస్టేబుల్ శివరాజ్

హిమాయత్‌నగర్, జనవరి 15: పతంగులు ఎగురవేసేందుకు ఉపయోగించే నిషేధిత చైనా మాంజా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ మెడ, గొంతుకు తగలడంతో లోతైన గాయం ఏర్పడి తీవ్ర రక్తస్రావమైన సంఘటన నారాయణగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ యు.చంద్రశేఖర్ తెలిపిన ప్రకారం.. అంబర్‌పేటలోని తిలక్‌నగర్‌లో నివాసం ఉండే ఏర్పుల శివరాజ్(34) అనే ట్రాఫిక్ కానిస్టేబుల్‌గా లంగర్‌హౌస్‌లోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం విధులు ముగించుకుని (టీజీ 09 7486) ద్విచక్ర వాహనంపై తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. అయితే నారాయణగూడ ఫ్లైఓవర్ పైన చైనా మాంజా శివరాజ్ మెడ, గొంతుకు తగలడంతో చర్మం కోసుకుపోయి తీవ్ర రక్తస్రావమైంది. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన శివరాజ్‌ను చికిత్స నిమిత్తం తిలక్‌నగర్‌లోని అభయ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. దవాఖానలో వైద్యులు చికిత్స చేసి గొంతు భాగంలో ఐదు కుట్లు వేశారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. బాధితుడు శివరాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.